నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, ఆదివారం 16 మార్చి 2025 | VIKARABAD

## అడ్డుకట్ట తొలగింపు

నమస్తే ఎఫెక్ట్

మండలంలోని కొండాపూర్, జనగాం గ్రామాల రైతుల మధ్య కోట్ పల్లి ప్రాజెక్టు నీళ్ల కోసం పంచాయితీ అన్న కథనం శనివారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితంగా కాగా అధికారులు స్పందించారు. రెండు గ్రామాల మధ్య ప్రధాన కాల్వకు వేసిన అడ్డుకట్టను జేసీబీ సహాయంతో అధికారులు తొలగించారు. దీంతో జనగాం, దుర్గాపూర్, కొండాపూర్ గ్రామాల ప్రజలకు సమపాళ్లలో సాగును నీరందుతుందని అధికారులు తెలిపారు.



-పెద్దేముల్, మార్చి 15



## 148 వాహనాల వేలం

### ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, మార్చి 15 : ఠాణాల పరిధిలో వదిలివేయబడిన, గుర్తు తెలియని వాహనాలకు వేలం వేస్తామని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ఠాణాల పరిధిలో వదిలివేయబడిన/గుర్తుతెలియని 148 వాహనాలను సేకరించి వికారాబాద్‌లోని జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రంలో భద్రపర్చామన్నారు. పోలీస్ చట్టం 1861లోని సెక్షన్ 26 ప్రకారం ఈ వాహనాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని నిర్ణయించామన్నారు. ఈ వాహనాల్లో ఏదైనా వాహనంపై ఎవరికైనా అభ్యంతరం, యాజమాన్య హక్కులు లేదా ఆసక్తి ఉంటే వారు ఎస్పీకి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక వారం లోపు వాహనాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చన్నారు. లేకపోతే ఈ వాహనాలను జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రంలో ఈ నెల 26న బహిరంగ వేలం వేస్తామన్నారు. మరింత సమాచారం కోసం వాహనాల వేలం కమిటీ చైర్మన్, జిల్లా అదనపు ఎస్పీ హనుమంత్‌రావు సెల్‌నం. 8712670012 ద్వారా సంప్రదించాలన్నారు. వాహనాల వివరాలు జిల్లా పోలీస్ సోషల్(Facebook, X, Whatsapp) మీడియాలోనూ అందుబాటులో ఉంటాయన్నారు.

## హెచ్‌సీయూ భూముల వేలంపై పోరాడతాం

సిటీబ్యూరో : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలోని 400 ఎకరాల భూమిని వేలం వేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా న్యాయబద్ధంగా పోరాడతామని జేఏసీ ప్రకటించింది. శనివారం యూనివర్సిటీ క్యాంపస్‌లో జేఏసీ సమావేశమై భూముల విషయంలో ప్రభుత్వ వైఖరిపై ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై చర్చించారు. హెచ్‌సీయూ భూములను విక్రయించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని తీర్మానించారు. భూముల కొనుగోలు, అమ్మకాలకోసం యూనివర్సిటీలోకి ఎవరినీ రానీయొద్దన్నారు. ప్రభుత్వం హెచ్‌సీయూ భూములను అమ్మకానికి పెట్టి పర్యావరణాన్ని నాశనం చేసేందుకు కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. యూనివర్సిటీ భవిష్యత్, పర్యావరణాన్ని కాపాడేందుకు విద్యార్థులు, ఉద్యోగులందరం కలిసికట్టుగా ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు.

**భూములు కోల్పోతే అంధకారమే..**

ఉన్నతమైన ప్రమాణాలు, నాణ్యమైన విద్య, పరిశోధనలతో దక్షిణ భారతంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పేరు ప్రఖ్యాతలు సంపాదించిందని జేఏసీ ప్రతినిధులు అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని రీసెర్చ్ సెంటర్లు, ప్రయోగశాలలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, అందుకు వందల ఎకరాల భూమి అవసరం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం అక్రమంగా భూములను అమ్మితే యూనివర్సిటీ భవిష్యత్ అంధకారంలోకి వెళ్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా కండ్లు తెరిచి భూముల వేలం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే న్యాయబద్ధంగా పోరాడతామని స్పష్టం చేశారు.

# ఆశలు ఆవిరి

### ప్రభుత్వం పెట్టుబడి సాయం ఇవ్వకున్నా అప్పులు చేసి పంటల సాగు


- అడుగంటుతున్న భూగర్భ జలాలతో అందని నీరు.. ఎండుతున్న పంటలు
- రంగారెడ్డి జిల్లాలో వెయ్యికి పైగా బోరు బావులు వట్టిపోయినట్లు గుర్తించిన అధికారులు
- కొత్తగా బోర్లు తవ్విస్తున్నా పడని నీళ్లు
- పెట్టిన పెట్టుబడి రాని దుస్థితి
- చేసిన అప్పులు తీర్చేందుకు మళ్లీ ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిందే : అన్నదాతలు



ఎండిన వరి పంటను మేపేందుకు గేదెను తీసుకెళ్తున్న రైతు

జిల్లాలో భూగర్భజలాలు అడుగంటుతున్నట్లుగానే అన్నదాతల ఆశలు కూడా ఆవిరవుతున్నాయి. ప్రభుత్వం రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని అందించకున్నా.. అప్పులు చేసి వరి పంటను సాగు చేసిన అన్నదాతకు కన్నీళ్లే మిగులుతున్నాయి. రోజురోజుకూ భూగర్భజలాలు అడుగంటుతుండడంతో జిల్లాలో వెయ్యికి పైగా బోరుబావులు ఎండిపోయినట్లు అధికారులు గుర్తించారు. దీంతో వాటి కింద సాగు చేసిన వరి పంట ఎండుముఖం పడుతున్నది. దానిని కాపాడుకునేందుకు కొత్తగా బోర్లు తవ్విస్తున్నా నీరు పడడంలేదు. కాగా జిల్లాలో 93,000 ఎకరాల్లో అన్నదాతలు వరి పంటను సాగు చేశారు.

రంగారెడ్డి, మార్చి 15 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని పలు మండలాల్లో గణనీయంగా తగ్గిపోతున్న భూగర్భజలాలతో వరి పంట ఎండుముఖం పడుతున్నది. యాసంగిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతన్నకు కన్నీరే మిగులుతున్నది. ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని అందించకపోయినా అప్పులు చేసి పంటలు సాగు చేసినా అన్నదాతను కరువు వెంటాడుతున్నది. జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, కేశంపేట, కొందుర్గు, ఆమనగల్లు తదితర మండలాల్లో వరి పంట ఎండిపోతున్నది. ఈ నెల ఆరంభం నుంచే పంటలు ఎండిపోవడం ఆరంభమైంది. 15 రోజుల వ్యవధిలోనే భూగర్భజలాలు గణనీయంగా పడిపోవడంతో జిల్లాలోని సుమారు వెయ్యికిపైగా బోరుబావులు ఎండిపోయినట్లు అధికారులు గుర్తించారు. దీంతో పంటను కాపాడుకునేందుకు అన్నదాతలు లక్షలాది రూపాయలు అప్పులు చేసి బోర్లు తవ్విస్తున్నా గంగమ్మ పైకి రావడంలేదు. ఇప్పటికే మంచాల మండలంలోని చిత్తాపూర్, తిప్పాయిగూడ, రంగాపూర్, చీదేడు, బండాలేమూర్, దాత్‌పల్లి, కొర్రతండా, సత్తితండా, లోయపల్లి, ఆంబోతుతండా వంటి ప్రాంతాల్లో వరి పంట ఎండుముఖం పట్టింది. దీంతో అన్నదాతలు తమ పంటను పశువుల మేతకు ఉపయోగిస్తున్నారు.



**జిల్లాలో 93 వేల ఎకరాల్లో సాగు..**

ఈ యాసంగిలో జిల్లాలో 93 వేల ఎకరాల్లో వరి పంటను అన్నదాతలు సాగు చేశారు. ప్రభుత్వం రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని అందించకున్నా రైతులు వడ్డీ వ్యాపారులు ఇతరుల వద్ద అప్పులు చేసి సాగు చేశారు.అయితే, జిల్లాలో ఒక్కసారిగా భూగర్భజలాలు అడుగంటిపోతుండడం తో బోర్లు వట్టిపోయి.. వాటి కింద సాగు చేసిన పంటలూ ఎండుముఖం పడుతున్నాయి. రోజురోజుకూ ఎండలు మండుతుండడంతో పంటను కాపాడుకునేందుకు అన్నదాతలు చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మంచాల, యాచారం, ఇబ్రహీంపట్నం, మాడ్గుల, ఆమనగల్లు, తలకొండపల్లి, కొందుర్గు, కేశంపేట, చౌదరిగూడ వంటి పలు మండలాల్లో కరువు ఘంటికలు మోగుతున్నాయి.

### మళ్లీ వలస వెళ్లాల్సిందే..?

బీఆర్ఎస్ హయాంలో చెరువులు, బోర్లలో సమృద్ధిగా నీరు ఉండడంతోపాటు.. ఠంచన్‌గా రైతుబంధు పెట్టుబడి సాయం సీజన్‌కు ముందే బ్యాంకు ఖాతాల్లో జమ కావడంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన పలువురు రైతులు స్వగ్రామాలకు వచ్చి వ్యవసాయం చేసుకుని కుటుంబాలతో కలిసి సంతోషంగా జీవించారు. అయితే.. గత 15 నెలల కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తంగా మారడం.. ఇప్పటికీ చాలామంది రైతులకు రైతుభరోసా పెట్టుబడి సాయం అందనేలేదు. దీంతో వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పులు చేసి పంటలను సాగు చేయగా.. అడుగంటుతున్న భూగర్భ జలాలు, విద్యుత్తు కోతలతో సాగు చేసిన పంట పండని పరిస్థితి నెలకొన్నది. పెట్టుబడి రాని పరిస్థితి ఉండడంతో అప్పులు తీర్చేందుకు మళ్లీ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి వచ్చిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఎండిన పంటను చూస్తే ఏడుపు వస్తున్నది



అప్పులు చేసి పంటను సాగు చేశా. కండ్ల ముందే పంట ఎండిపోతుండడంతో ఏడుపు వస్తున్నది. పెట్టుబడికి పెట్టిన డబ్బు వచ్చే పరిస్థితి కనిపించడంలేదు. వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతన్నకు ప్రతిఏటా అప్పులే మిగులుతున్నాయి. అప్పులు తీర్చేందుకు వ్యవసాయాన్ని వదిలి ఉపాధి కోసం వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి వచ్చింది. -వెంకటాచారి లోయపల్లి

### అప్పులు ఎలా చెల్లించాలో అర్థం కావడంలేదు..



రెండెకరాలు కౌలుకు తీసుకుని వరి పంటను సాగు చేశా. ఇందుకోసం వ్యాపారి వద్ద కొంత డబ్బు అప్పుగా తీసుకున్నా. అయితే భూగర్భజలాలు పాతాళానికి చేరుతుండడంతో పంట ఎండిపోతున్నది. అప్పు ఇచ్చిన వ్యాపారి ఇంటికి వస్తే ఏమి చెప్పాలో.. ఏ విధంగా ఆ అప్పును చెల్లించాలో అర్థం కావడంలేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

-చిల్కూరి కావ్య, కౌలురైతు; రంగాపూర్

## ఎండిన పంటల పరిశీలన

కేశంపేట : వేసవిలో పంటలకు నీరందక ఎండిపోతున్న విషయమై నమస్తే తెలంగాణ డిజిటల్ మీడియాలో ప్రచురితమైన 'ఎండుతున్న పంటలు.. దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు'.. అనే కథనానికి వ్యవసాయశాఖ అధికారులు స్పందించారు. శనివారం మండలంలోని సంతాపూర్ గ్రామాన్ని సందర్శించి ఎండిన పంటలను పరిశీలించి వివరాలు సేకరించారు. గ్రామంలోని సర్వేనంబర్ 234లో కుమ్మరి వెంకటేశ్ రెండు ఎకరాల్లో వరి, మూడు ఎకరాల్లో మొక్కజొన్న, కుమ్మరి రాందాస్ 1.20 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశాడు. నీరందక వరి, మొక్కజొన్న పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, నివేదికలను ఉన్నతాధికారులకు పంపించామని ఏఈవో తెలిపారు. మొక్కజొన్నకు రూ.లక్ష, వరి పంటకు రూ. 40 వేల వరకు అప్పులు చేసి సాగు చేశామని, ప్రభుత్వం స్పందించి ఆర్థికంగా ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.



ఎండిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏఈవో



ఎండిపోయిన రాజశేఖర్ సాగు చేసిన వరి పంట

## 24 గంటల్లో నాలుగు బోర్లు..
# అయినా..చుక్కనీరు రాలే



నాకు 6.13 ఎకరాల పొలం ఉన్నది. అందులోని నాలుగు ఎకరాల్లో వరి పంటను సాగు చేశా. ప్రస్తుతం నీరు లేక పంట ఎండిపోయే దశకు చేరడంతో పట్టణంలోని ఓ షావుకారు వద్ద రూ. 1,96,000 అప్పు చేసి 24 గంటల్లో (శని, ఆదివారాల్లో) పొలంలో నాలుగు బోర్లు తవ్వించా. అయినా చుక్క నీరు పడలేదు. మొదటి బోరు 250 ఫీట్లు, రెండో బోరు 360 ఫీట్లు, మూడోబోరు 350 ఫీట్లు, నాల్గో బోరు 600 ఫీట్లు తవ్వించా. బోరు నిర్వాహకుడికి రూ.1,50,000 చెల్లించి.. మిగిలిన మొత్తాన్ని తర్వాత ఇస్తానని చెప్పా. కాగా అప్పు ఇచ్చిన షావుకారు 15 రోజుల్లో తీసుకున్న మొత్తాన్ని చెల్లించాలనే నిబంధన పెట్టడంతో ప్రస్తుతం నా పరిస్థితి దారుణంగా మారింది. బోర్లు వేసినా ఫలితం లేకపోవడంతోపాటు గతంలో చేసిన అప్పులే ఇప్పటికీ తీరలేదు. ఈ కొత్త అప్పును ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. కుటుంబ పోషణ కూడా కష్టంగా మారింది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

-రాజశేఖర్, చింతామణ పట్టణం, తాండూరు మండలం



ఘనాపూర్ వద్ద ఉన్న ఓ ఇటుకబట్టీలో వినియోగిస్తున్న అటవీ కలప

## విచ్చలవిడిగా నరుకుతూ..
# గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తూ

**అంతరిస్తున్న అడవులు**

- యథేచ్ఛగా ఇటుక బట్టీలకు అటవీ కలప వినియోగం
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు
- మామూళ్ల మత్తులో జోగుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం

కులకచర్ల, మార్చి 15 : ఇటుక బట్టీలకు అటవీ కలపను అక్రమంగా వినియోగిస్తూ కొందరు అడవులను నాశనం చేస్తున్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో అడవులున్నాయి. వాటి సంరక్షణకు ప్రతి సెక్షన్‌కు ఒక అటవీశాఖ అధికారిని ప్రభుత్వం నియమించింది. అలాగే పలు గ్రామాల్లో వనసేవలకులనూ నియమించారు. అయినా కొందరు అడవుల్లోని కలపను విచ్చలవిడిగా నరుకుతూ గుట్టుచప్పుడు కాకుండా ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. రాత్రి సమయాల్లో ఈ తంతు యథేచ్ఛగా సాగుతుంటే అటవీశాఖ అధికారులు మాత్రం మొద్దు నిద్రలో ఉంటున్నారని.. ఇటుక బట్టీల వ్యాపారులు ఇచ్చే డబ్బులకు ఆశపడి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. గతంలో అడవిలో నుంచి ఒక్క కట్టెను కొట్టినా వనసంరక్షణ సమితి ఆధ్వర్యంలో వారికి జరిమానాలు విధించేవారు. అయితే, వనసంరక్షణ సమితిలు రద్దు కావడంతో అడవుల పూర్తి బాధ్యతను ప్రభుత్వం అటవీశాఖ అధికారులకు అప్పగించింది. అప్పటి నుంచి అడవుల నుంచి కలపను ఇటుకబట్టీల వ్యాపారులు, ఇతర కట్టెల వ్యాపారులు యథేచ్ఛగా నరికి తరలిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోకుంటే రానున్న రోజుల్లో అడవులు పూర్తి స్థాయిలో అంతరించిపోయే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. అదేవిధంగా ఇటుక బట్టీలకు విద్యుత్తు కనెక్షన్లను అక్రమంగా తీసుకుంటూ వాటి నిర్వాహకులు విద్యు త్తు చౌర్యానికి పాల్పడుతున్నారు. ఇటుకల తయారీకి మట్టిని ప్రతి ఏటా తీస్తుండడంతో రానురాను భూసారం తగ్గిపోతున్నది. దీంతో ఆ పొలాల్లో భూసారం క్షీణించి పంటలు పండే అవకాశం లేకుండా పోతున్నది. అలాగే గ్రామాల్లో ఎలాంటి అనుమతుల్లేకుండానే ఇటుకబట్టీలను ఏర్పాటు చేస్తున్నారు.



ఓ ఇటుకబట్టీ వద్ద అనుమతి లేకుండానే విద్యుత్తు వినియోగం

### అక్రమంగా విద్యుత్తును వాడితే చర్యలు

ఇటుక బట్టీల వద్ద అనుమతి లేకుండా విద్యుత్తును వాడితే కేసులు నమోదు చేస్తాం. గతంలో పలువురిపై కేసులు నమోదు చేశాం. ఎవ్వరూ ఇటుక బట్టీలకు అక్రమంగా విద్యుత్తును వినియోగించరాదు.

-హైమద్, విద్యుత్తు శాఖ ఏఈ, కులకచర్ల

### కలపను ఇటుకబట్టీలకు వాడొద్దు

మండలంలోని అడవుల నుంచి కలపను నరికి అక్రమంగా ఇటుక బట్టీలకు తరలిస్తే వారిపై అటవీశాఖ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తాం. ఇటుకబట్టీలకు ఎట్టి పరిస్థితుల్లోనూ కలపను వాడకూడదు. అడవుల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత, అతిక్రమిస్తే చర్యలు తప్పవు.

-సాయికుమార్, ఫారెస్ట్ అధికారి, కులకచర్ల

### పర్మిషన్ లేకుండా కలపను నరకొద్దు

పట్టా భూములు, ఇతర భూముల్లో ఉన్న కలపను అనుమతి లేకుండా నరికి ఇటుకబట్టీలకు వినియోగిస్తే చర్యలు తీసుకుంటాం. పట్టాభూము ల్లోని కలపను నరకాలన్నా తప్పనిసరిగా అనుమతి తీసుకోవాల్సిందే. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు.

-మురళీధర్, తహసీల్దార్ కులకచర్ల

# ప్రతి నిమిషానికి రెండు ఉల్లంఘనలు

## పోలీసుల స్పెషల్ డ్రైవ్‌లో కేసులే కేసులు

సిటీబ్యూరో : నిమిషానికి రెండు.. ఐదు రోజుల్లో పదిహేను వేలు.. ఇది ట్రాఫిక్ ఉల్లంఘనల కేసుల సంఖ్య. ఇందులో ఒక్క రాంగ్ రూట్‌లో నమోదైన కేసులే పన్నెండు వేలకు పైగా ఉన్నాయి. అంటే హైదరాబాద్‌లో వాహనదారులు ఎంత యథేచ్ఛగా ట్రాఫిక్ రూల్స్ బ్రేక్ చేస్తున్నారో ఈ కేసుల సంఖ్యేచెబుతున్నది. రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్, సెల్‌ఫోన్ చూస్తూ వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్, సిగ్నల్ జంపింగ్, నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్, అవసరం లేకున్నా.. అనుమతి లేకున్నా ప్రత్యేక హారన్లు ఉపయోగించడం, డ్రంక్ అండ్ డ్రైవ్.. ఇలా ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తూ యథేచ్ఛగా ఉల్లంఘనలకు పాల్పడుతుండడంతో నగరంలో ట్రాఫిక్ అస్తవ్యస్తమవుతున్నది. నిబంధనలు పాటించాలని హైదరాబాద్ కమిషనరేట్ పోలీసులు ఎంతగా అవగాహన కల్పిస్తున్నా.. వాహనదారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. ముఖ్యంగా సిటీ రోడ్లపై యువత వాహానాలను నడిపే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈనెల 3నుంచి కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇందులో ప్రధానంగా రాంగ్ సైడ్ డ్రైవింగ్, హారన్ల వినియోగం, నంబర్ ప్లేట్ల ట్యాంపరింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో వేల సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి.

### 61 ప్రాంతాల్లో రాంగ్‌రూట్ డ్రైవింగ్

రాంగ్‌రూట్ డ్రైవింగ్ ఎక్కువగా యూటర్న్‌ల వద్దే జరుగుతున్నదని, నగరంలో ఎక్కువగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు రాంగ్‌సైడ్ డ్రైవింగే కారణంగా పోలీసులు గుర్తించారు. కొందరు యూటర్న్ తీసుకునేందుకు ఒకటి నుంచి రెండు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందని షార్ట్‌కట్‌లో ప్రయాణిస్తున్నారు. ఎక్కడా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పట్టించుకోకుండానే డేంజరస్ డ్రైవింగ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సిటీ కమిషనరేట్ పరిధిలో 61 ప్రాంతాల్లో అత్యధికంగా రాంగ్‌రూట్ డ్రైవింగ్ జరుగుతున్నట్లు పోలీసులు గమనించారు. ఇలాంటి ప్రాంతాల్లో వాహనదారులు వన్‌వే, సిగ్నల్స్, యూటర్న్‌లు, ఫ్లై ఓవర్ల కింద, నో ఎంట్రీ రూట్‌లో ఎక్కువగా రాంగ్‌రూట్ డ్రైవింగ్ చేస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉండే పాతబస్తీ, అమీర్‌పేట, ఖైరతాబాద్, పంజాగుట్ట, సికింద్రాబాద్ వంటి ప్రాంతాల్లో షార్ట్ కట్ కోసం రాంగ్ సైడ్‌లో వెళ్తున్నారు. ఇలాంటి డ్రైవింగ్ వల్ల ట్రాఫిక్ రూల్స్ పాటించేవారు కూడా ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ నెలలో ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో ఐదు రోజుల్లో 12వేలకు పైగా రాంగ్‌రూట్, 13వందల నంబర్ ట్యాంపరింగ్ కేసులు, 1200కు పైగా హారన్ దుర్వినియోగం కేసులు నమోదయ్యాయంటే వాహనదారులు ఎంత నిర్లక్ష్యంగా ఉంటున్నారో గమనించొచ్చని ట్రాఫిక్ పోలీసులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా నగరంలో గత నెల చివరివారంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 1320 నమోదు కాగా ఇందులో ఎక్కువగా ద్విచక్రవాహనాలపై వెళ్తున్నవారు, అందులోనూ యువతే ఈకేసుల్లో ఎక్కువగా పట్టుబడుతుండడం గమనార్హం.

### సైరన్ల మోతలకు బ్రేక్..

హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల స్పెషల్‌డ్రైవ్‌లో ఇటీవల పంజాగుట్టలో పెంపుడు కుక్కకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించేందుకు సైరన్‌మోగిస్తూ వెళ్తున్న ఆంబులెన్స్ డ్రైవర్‌ను పోలీసులు పట్టుకున్నారు. మరో సంఘటనలో బంజారాహిల్స్ నుంచి మాదాపూర్‌వైపు వెళ్తున్న ఒక అంబులెన్స్ జూబ్లీచెక్‌పోస్ట్ దగ్గర ట్రాఫిక్ రద్దీలో సైరన్ వేస్తూ వెళ్తుండగా.. అంబులెన్స్‌కు రూట్‌క్లియర్ చేసిన పోలీసులు తీరా లోపల చూస్తే డ్రైవర్ ఫోన్ మాట్లాడుతూ కనిపించాడు. అందులో పేషంట్లే లేరు. ఇటువంటి కేసులు సుమారుగా 1200కు పైగా ఈ వారం రోజుల్లో పోలీసులు గుర్తించారు. వీటిలో ప్రజాప్రతినిధులు, మాజీలు, కొందరు వీవీఐపీలు మాత్రమే కాకుండా నగరంలో పెద్ద మనుషులుగా చలామణి అవుతూ దర్పం ప్రదర్శించేందు కు తమ కార్లకు పోలీ స్, అంబులెన్స్ సైరన్లు బిగించుకుని ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమించిన వారూ ఉన్నారు. వీరందరిపై కేసులు నమోదు చేయడంతో పాటు కౌన్సెలింగ్ ఇచ్చి పంపిస్తున్నారు. సిటీలో 1500 అంబులెన్స్‌లు ఉండగా వీటిలో 40శాతం అంబులెన్స్‌లు అత్యవసర సేవల పేరుతో మామూలు పనులకూ సైరన్ మోగిస్తూ వెళ్తున్నట్లు గుర్తించారు. అత్యవసరం లేకున్నా సైరన్లు వేసి అంబులెన్స్‌లు నడపడం డ్రైవర్లు అలవాటుగా మార్చుకున్నారు. వారికి వార్నింగ్ ఇచ్చి మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కావద్దని, ఎమర్జెన్సీ సేవలకు అంతరాయం కలగకుండా స్వీయనియంత్రణ పాటించాలని సూచించారు.

